క్లుప్తంగా

పరీక్షలకు శ్రద్ధగా సిద్ధం కావాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయ్

యాచారం: పరీక్షల సమయంలో విద్యార్థులు ఆతృత చెందకుండా, శ్రద్ధగా చదువుకొని ముందుకు సాగాలని ఇంపాక్ట్ సంస్థ ప్రతినిధి విజయ్ సూచించారు. మండల పరిధి నందివనపర్తి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎగ్జామ్స్ టైంలో భయం, ఆందోళన చెందితే మార్కులు సాధించలేమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

'మత్స్య' సదస్సును జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మత్స్య కార్మికులు

ఇబ్రహీంపట్నం: మత్స్య మహిళా జాతీయ సదస్సును జయప్రదం చేయాలని మత్స్య మహిళా సొసైటీ అధ్యక్షురాలు మంగ కోరారు. గురువారం ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 8,9 తేదీల్లో నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకర్, జంగయ్య, బాబు, రాములు, బీమ్, బాలరాజ్, గణేశ్, బాలగణేశ్, భిక్షపతి, గోపాల్‌లు పాల్గొన్నారు.

భోజన పథకం నుంచి మినహాయించాలి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంలు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన పథకం విధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ప్రధానోధ్యాయులు కోరారు. గురువారం మండల విద్యాధికారి హీర్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. భోజన పథకంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని విన్నవించినట్లు పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్, ప్రధానోపాధ్యాయులు గోవర్ధన్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌లు తెలిపారు.

నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న బిక్కయ్య

అబ్దుల్లాపూర్‌మెట్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మాడ్గుల మండల అధ్యక్షుడిగా అర్కపల్లి గ్రామానికి చెందిన ఏర్పుల బిక్కయ్యను నియమించినట్లు ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పెంటయ్య తెలిపారు. గురువారం పెద్దఅంబర్‌పేటలోని ఎస్సీసెల్ కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీలను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు ఇళ్లు కేటాయించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు 5 శాతం ఇళ్లు కేటాయించాలని బంజారా దివ్యాంగ ఐక్య సమితి నాయకులు కోరారు. గురువారం ఎంపీడీఓ మాధురికి సమితి రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి శ్రీనులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనునాయక్, విజయ్‌రాథోడ్, బిక్కు, రాములు ఉన్నారు.

పల్లెల్లో డ్రైనేజీ అస్తవ్యస్తం

పల్లెల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి.. వ్యర్థ జలాలు ముందుకు సాగక, రోడ్డుపైనే ప్రవహిస్తున్నాయి. దీంతో రోడ్డంతా మురుగునీటితో నిండి తీవ్ర దుర్వాసన వస్తోందని బాధిత గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

- రోడ్డుపైనే ప్రవహిస్తున్న మురుగు నీరు
- దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్న ప్రజలు
- విష జ్వరాల బారిన పడుతున్న జనం
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు
- సెక్రటరీల అక్రమాలపై ఎమ్మెల్యేకు ఫిర్యాదులు



తాడిపర్తిలో మ్యాన్‌హోల్ నిండి రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ

యాచారం: డ్రైనేజీ కంపుతో పల్లె ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాలువల నిర్వహణ లోపంతో ఇళ్లమధ్యే వ్యర్థజలాలు పారుతూ తీవ్ర దుర్వాస వస్తోందని, ఇళ్లలో ఉండలేక పోతున్నామని పేర్కొంటున్నారు. మండల పరిధి నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, నందివనపర్తి, మంతన్‌గౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లో మురుగు కాలువలు పూర్తిగా నిండి రోడ్డుపైనే పారుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదంటున్నారు. యాచారం, గునుగల్, నందివనపర్తి, మాల్, నల్లవెల్లి, చింతుల్ల, మొండిగౌరెల్లి, కొత్తపల్లి, తక్కళ్లపల్లి తదితర గ్రామాలు విస్తరిస్తున్నప్పటికీ.. డ్రైనేజీ విస్తరణకు నోచుకోవడం లేదని వెల్లడిస్తున్నారు.

పట్టించుకోని ప్రత్యేకాధికారులు

సర్పంచుల పాలన కాలం ముగిసిన ఏడాది కాలంగా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. మండల పరిధి 24 గ్రామాలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. కానీ వారు పల్లెల ముఖం చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం యాచారం ప్రత్యేకాధికారి ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి మినహా.. మరే అధికారి వారానికి ఒకసారైనా గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు లేక, ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో పంచాయతీ కార్యదర్శులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు, పరిశ్రమలు, వెంచర్లకు అనుమతులు మంజూరు చేస్తు దండిగా దండుకుంటున్నారని, ఇదే విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి పలువురు ఫిర్యాదు చేశారు.



నానక్‌నగర్ ఆరో వార్డులో ఇళ్ల మధ్య..



నానక్‌నగర్‌లో మోరీ లేక రోడ్డుపైనే..

దుర్వాసతో రోగాలు



నానక్‌నగర్ గ్రామంలోని ఆరో వార్డులో కొన్ని నెలలుగా డ్రైనేజీ నీరు రోడ్డుపైనే పారుతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. తీవ్ర దుర్వాసన, దోమలతో విషజ్వరాల బారిన పడుతున్నాం. ప్రత్యేకాధికారి పట్టించుకోవడం లేదు.

– కొప్పు రవి, నానక్‌నగర్

ప్రజాప్రతినిధులు లేక..



ప్రజాప్రతినిధులు లేకపోవడంతో పల్లెల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. గ్రామాలకు ప్రత్యేకాధికారులు ఎప్పుడు వస్తున్నారో.. పోతున్నారో తెలియడం లేదు. ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి.

– తలారి మల్లేశ్, తక్కళ్లపల్లి

ప్రజా సమస్యలపై దృష్టి



గ్రామాల్లో డ్రైనేజి సమస్య లేకుండా కృషి చేస్తా. స్పెషల్ డ్రైవ్ ద్వారా మురుగు కాలువలను శుభ్రం చేయిస్తా. జీపీ కార్యదర్శులతో మాట్లాడి, సమస్యను తీర్చేందుకు కృషి చేస్తా. కొన్ని గ్రామాల్లో వ్యవసాయ పొలాల వద్ద రైతులు మురుగు నీరు రానియకుండా అడ్డుకోవడంతో సమస్య వచ్చింది.

– శ్రీలత, మండల పంచాయతీ అధికారి

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సత్యం

ఆమనగల్లు: ఆటల పోటీలు క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొందిస్తాయని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. మండల పరిధి శెట్టిపల్లిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ గురువారంతో ముగిసింది. పురుషుల విభాగంలో మొదటి బహుమతి ఆకుతోటపల్లి, రెండో బహుమతి జడ్చర్ల టీమ్, మూడో స్థానంలో చంద్రధన జట్టు నిలవగా, మహిళల విభాగంలో ప్రథమ స్థానంలో సాట్స్ అకాడమీ, ద్వితీయంగా కోటి ఉమెన్స్ కళాశాల, తృతీయ స్థాయిలో కరీంనగర్ జట్లు నిలిచాయి. విజేత జట్లకు సత్యం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా నిర్వహించే పోటీల్లో అనేక జట్లు పాల్గొంటాయని, ప్రస్తుత నాలుగో టోర్నికి 33 టీమ్‌లు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోదాదేవి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ఆలయ కమిటీ చైర్మన్ సింగిని శ్రీనివాస్, పీఈటీలు మల్లేశ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట పర్యావరణ ధ్వంసం

ఇబ్రహీంపట్నం: అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని విధ్వంసం చేయడం సరైంది కాదని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. ఈపీఓ ఆధ్వర్యంలో గురువారం 'మానవ చర్యల ప్రభావం పర్యావరణ సమతుల్యానికి సవాళ్లు– పరిష్కార మార్గాలు' అనే అంశంపై ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సహజ వనరులైన గాలి, నీరు, భూమి కాలుష్యమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీని ఫలితంగా ప్రకృతి విధ్వంసానికి గురై.. పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి ప్రకృతిని కాపాడుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ గురించి మాట్లాడిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వృక్ష శాస్త్ర అధ్యాపకుడు రచన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, ఈపీఓ కన్వీనర్ శివకుమార్, అధ్యాపకులు సురేష్, కృష్ణ, రవి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ గేమ్‌లతో మోసపోవద్దు

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: యువత ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి, మోసపోయి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధి తాడిపర్తి గ్రామంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ గేమ్స్, గంజాయి, డ్రగ్స్ వాడకం, చేడు వ్యసనాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధిక డబ్బు ఆశతో ఆన్‌లైన్ బెట్టింగులు ఆడి, డబ్బులు పోగొట్టుకుని, అప్పుల పాలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఫార్మాసిటీ ఎస్ఐ తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక సహాయం



సహాయం అందజేస్తున్న చైర్మన్ భరత్‌కుమార్

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సభ్యుడు, తారమతిపేట గ్రామానికి చెందిన చేగూరి బాలయ్య ఇటీవల మృతిచెందాడు. ఈ మేరకు సంఘం తరఫున రూ.25వేల ఆర్థిక సాయాన్ని మృతుడి భార్య కొమురమ్మకు గురువారం సంఘం కార్యాలయంలో చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ అందజేశారు. నార్లకొండ జంగమయ్య, బాలకృష్ణ, సంజీవరెడ్డి, అకౌంటెంట్ రాకేశ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.

9న జాబ్ మేళా

ఇబ్రహీంపట్నం: కొంగర ఇండస్ట్రీయల్ ఏరియాలో పనిచేసేందుకు 9న ఇబ్రహీంపట్నంలోని ఓసీ కమ్యూనిటీ హాల్‌లో జాబ్ మేళాను సెన్యర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహిస్తుందని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కప్పరి ప్రవంతి తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాల లోపున్న యువతీయువకులు అర్హులని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీ, డిప్లొమా సర్టిఫికెట్స్ జిరాక్స్ ప్రతులు, ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, ఎంపికైన వారికి ఉచిత రవాణా, భోజన సదుపాయం ఉంటుందన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

ఆమనగల్లు: మున్సిపాలిటీ పరిధి చంద్రాయణపల్లితండాలో తాగునీటి సమస్యను కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు చెప్పారు. తండా వాసుల విన్నపంతో గురువారం మున్సిపల్ ఏఈ శ్రీనివాసులుతో కలిసి తండాలో పర్యటించారు. నీటి సమస్యను తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి అవసరమైతే పైప్‌లైన్ వేయడంతో పాటు రెండు గేట్ వాల్వులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాగ్యానాయక్, గోపాల్‌నాయక్, రవి, రమేశ్, లక్ష్మణ్, మల్లేశ్‌నాయక్, మున్సిపల్ సిబ్బంది మొయిన్, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రాములు నాయక్ మరణం తీరని లోటు

మంచాల: సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు రాములు నాయక్ మరణం తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. గురువారం మండలంలోని చెన్నారెడ్డిగూడ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన నాయక్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు స్వామి, పాండు, వెంకటేశ్, ప్రహల్లాద్, కృష్ణ, జంగయ్య, సుధాకర్, శంకర్, భిక్షపతి, శ్రీకాంత్, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

9న ఉచిత వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: లయన్ ఇంటర్నేషనల్, రంగారెడ్డి హెల్త్ కేర్, వైష్ణవి డెంటల్ ఆస్పత్రులు సంయుక్తంగా 9న శేరిగూడలో ఉచిత వైద్య శిబిరాన్ని డాక్టర్ తేజస్వినిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిపుణులైన వైద్య సిబ్బందితో చిన్నపిల్లల వ్యాధులు, దంత, కంటి, మధుమేహం పరీక్షలు, అస్తమా, టీబీ, జలుబు, వైరల్ ఫీవర్, నిమ్ము, బీపీ, షుగర్, చాతి వ్యాధిగ్రస్తులకు ఉచిత పరీక్షలను నిర్వహించి, మందులు అందజేయనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ఆమనగల్లు: నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌ను గురువారం పుర కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, డాక్టర్ హేమ్‌లాల్‌లు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



కమిషనర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వం

- అమలు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్
- మోసపూరిత పార్టీని ఓడించాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: అమలు సాధ్యం కాని హామీలతో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని, అధికారం చేపట్టి 15 నెలలు దాటినా.. ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, ఆ పార్టీ మోసాలను ఎండగట్టి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. గురువారం మండల కేంద్రంలో దండేటికార్ శర్వంచ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో సమన్వయంతో పని చేసి మోసపూరిత కాంగ్రెస్‌ను ఓడించి, పార్టీ బలపర్చిన అభ్యర్థుల గెలుపుకోసం బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. అందు కోసం ఈ నెల 10వ తేదీ లోపు గ్రామస్థాయిలో సమావేశాలు, సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నారు. కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు, భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏర్పుల చంద్రయ్య, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి బహదూర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



క్రికెట్ టోర్నీ ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: ప్రతిభ కలిగిన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో గురువారం క్రికెట్ టోర్నీ ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఆయన చెప్పారు. అండర్ 19 మహిళా ప్రపంచ క్రికెట్‌లో రాణించిన తెలంగాణ వాసి గొంగడి త్రిషకు సీఎం రేవంత్‌రెడ్డి రూ.1 కోటి బహుమతిగా అందించారని, క్రీడాకారులను తీర్చిదిద్దడానికి ఫోర్త్‌సిటీలో స్పోర్ట్స్‌సిటీ, ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు ప్రభుత్వం నిర్మించనుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బిక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు లక్పతినాయక్, నాయకులు జవహర్‌లాల్ నాయక్, హీరాసింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో 37,785 మంది ఓటర్లు



తలకొండపల్లి: అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీకాంత్

ఆమనగల్లు: తలకొండపల్లి మండలంలో 37,785 మంది ఓటర్లు ఉన్నారని ఎంపీడీఓ శ్రీకాంత్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురుషులు 19,082, మహిళలు 18,702, ఇతరులు ఒకరు ఉన్నారని పేర్కొన్నారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు శంకర్, రవిగౌడ్, పాండు, మోహన్‌రెడ్డి, రవియాదవ్, యాదగిరి, నర్సింహారెడ్డి, గణేశ్, మల్లేశ్‌యాదవ్, పాండు, తిరుపతి పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు మండలంలో 14,709 మంది ఓటర్లు ఉన్నారని ఎంపీడీఓ కుసుమమాధురి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పురుషులు 7,412 మంది, మహిళలు 7,297 మంది ఉన్నారని వివరించారు. మండలంలో 5 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని చెప్పారు.

సీపీఎం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం



కంటి పరీక్ష చేస్తున్న వైద్యురాలు

ఇబ్రహీంపట్నం రూరల్: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం కప్పపహాడ్ గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ, సెయింట్ గ్రిగోరియస్ బాలగ్రామ్ వారి భాగస్వామ్యంతో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో బాలాగ్రామ్ డైరెక్టర్ థామస్ పప్పు, సెబాస్టియన్, సీపీఎం జిల్లా నాయకులు సీహెచ్ జంగయ్య, మండల కార్యదర్శి బుగ్గ రాములు, నాయకులు ప్రభుదాస్, జంగయ్య, రవి, ప్రేమ్‌దాస్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గంధోత్సవం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న నాయకులు

ఆమనగల్లు: మండల పరిధి శెట్టిపల్లి గ్రామంలో సయ్యద్ దావల్ పీర్ దర్గా వద్ద రెండు రోజులుగా నిర్వహించిన ఉర్సు ఉత్సవాలు గురువారం ముగిశాయి. ఇందులో భాగంగా బుధవారం రాత్రి గంధోత్సవం నిర్వహించారు. శెట్టిపల్లి మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం నివాసం నుంచి గంధం ఊరేగింపు ప్రారంభించి దర్గావద్దకు చేరుకున్నారు. అనంతరం దర్గా వద్ద ఫాతేహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాల్లో నిర్వాహకులు సయ్యద్ దావల్ పాష, షకీల్, షరీఫ్, షఫి, గోదాదేవి, సింగిని శ్రీనివాస్, నర్సింహ, పెద్దాచారి, దినేశ్, సయ్యద్, రంజాన్, షఫీ, మహేశ్, జంగయ్య, నగేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుంభమేళా పవిత్ర జలాలకు పూజ



గంగా జలాలతో నాయకులు

ఆమనగల్లు: ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో కొనసాగుతున్న మహాకుంభమేళా త్రివేణి సంగమంలోని పవిత్ర గంగా జలాలకు కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆ నీటిని వాటర్‌ట్యాంక్‌లలో కలిపారు. ప్రయాగ్‌రాజ్‌ను రెండు రోజుల క్రితం ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణలు సందర్శించారు. అక్కడి నుంచి గంగా జలం తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు రాఘవేందర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



సీఐని సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

మాడ్గుల: సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌రావును గురువారం యూత్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమను కలవాలని సూచించారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడేది లేదని స్పష్టంచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ బాబా, రమేష్, వెంకటేశ్ ఉన్నారు.